సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 5 । జనవరి । 2025



అసైన్డ్ భూములకు పట్టాలు!
దమ్మపేట మండలంలో నిబంధనలు ఉల్లంఘించి అసైన్డ్ భూములను గిరిజనేతరులు పట్టాలు చేయించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. 10లో



ముగిసిన కథా కవితా కార్యశాల
కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్న కథా, కవితా కార్యశాల పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 16°

వాతావరణం
జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వాతావరణం మాత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ప్రతిభ’ పరీక్షకు 292 మంది హాజరు

కొత్తగూడెంఅర్బన్‌: కొత్తగూడెంలో శనివారం జరిగిన ప్రతిభా పాటవ పరీక్షకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి 292 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను పరిశీలించిన డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ దేశానికి ఉత్తమ పౌరులను అందించేది సాంఘిక శాస్త్రమేనని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మరింతగా కృషి చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం రిటైర్డ్‌ సోషల్‌ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏసీజీఈ మాధవరావు, ఎస్‌ఓ సైదులు, సోషల్‌ ఫోరం అధ్యక్షుడు బి.తారాచంద్‌, ప్రధాన కార్యదర్శి ఎల్‌.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

దుమ్ముగూడెం : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ట్రైబల్‌ వెల్ఫేర్‌ డీడీ మణెమ్మ సూచించారు. మండలంలోని రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్‌ ఫ్యాక్టరీల్లో చైర్మన్‌ పరిశీలన



అప్పారావుపేటలో యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న రాఘవరెడ్డి

దమ్మపేట: తెలంగాణ ఆయిల్‌ ఫెడ్‌ చైర్మన్‌ జంగా రాఘవరెడ్డి శనివారం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని పామాయిల్‌ ఫ్యాక్టరీలను పరిశీలించారు. గెలల కాడలు తక్కువగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. గెలల క్రషింగ్‌, విస్తరణ పనులతో పాటు యంత్రాల పనితీరును తనిఖీ చేశారు. యంత్రాలకు సకాలంలో మరమ్మతులను నిర్వహించాలని అన్నారు. ఫ్యాక్టరీ సమగ్ర నివేదికపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్‌ మేనేజర్‌ సుధాకర్‌ రెడ్డి, ప్రాజెక్ట్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌ రెడ్డి, డివిజనల్‌ మేనేజర్‌ ఆకుల బాలకృష్ణ, మేనేజర్లు కళ్యాణ్‌, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరం వెంట ఏర్పాటు చేస్తున్న విడిది



సండే స్పెషల్

గోదారి తీరంలో క్యాంప్‌ సైట్‌ !

భద్రాద్రిలో భక్తుల పర్ణశాలకు ఏర్పాట్లు
- పనులు పూర్తయితే పట్టణానికి సరికొత్త సొబగులు
- శిబిరాల్లో సోలార్‌ కాంతుల వెలుగు జిలుగులు
- భక్తులకు అందుబాటులో గిరిజన రుచులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రామాయణ గాథలో వనవాసం చేసేందుకు సీతారాములు అయోధ్యను వదిలి దండకారణ్యం చేరుకున్నారు. గోదావరి తీరంలో వెదురుతో చేసిన కుటీరంలో జీవనం సాగించారు. అడవుల్లో దొరికే ఫలాలు, కందమూలాలనే ఆహారంగా స్వీకరించారు. సీతారాముల వనవాస ఘట్టంలో పర్ణశాల విశేషాలు ఎంతో మనోహరంగా ఉంటాయి. ఆ స్థాయిలో కాకపోయినా నేటి పరిస్థితులకు తగ్గట్టుగా భక్తులు గోదావరి తీరంలో విడిది చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

సరికొత్త అనుభూతి ఇచ్చేలా..

శీతాకాలం వచ్చిందంటే చాలు మంచు దుప్పటిలో సేద తీరేందుకు, ప్రకృతితో ముచ్చటించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తారు. మన పొరుగునే ఏపీలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి, వంజంగి, తానంగి, అరకు, మారేడుమిల్లి ప్రాంతాలకు వెళ్తుంటారు. అక్కడ పంట పొలాల్లో, గుట్టలపై ఏర్పాటు చేసిన క్యాంపుల్లో విడిది చేస్తుంటారు. అక్కడికి వెళ్లిన పర్యాటకులకు మన దగ్గర ఇలాంటి ఏర్పాట్లు ఉంటే బాగుండేది కదా అనిపిస్తుంటుంది. మరోవైపు ముక్కోటి, శ్రీరామనవమి, హనుమాన్‌ మాలధారణ సమయాల్లో భద్రాచలానికి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. ముఖ్యంగా ముక్కోటి, నవమి సందర్భంగా పట్టణం కిక్కిరిసిపోతుంది. స్థానికంగా ప్రైవేటు లాడ్జీలు, హోటళ్లు, దేవస్థానం సత్రాలు, పలు ప్రైవేటు సత్రాలు ఉన్నా.. గదులు దొరకక, వసతి లేక భక్తులు ఇబ్బంది పడుతుంటారు. దీంతో స్థానికంగా ఉన్న హోం స్టేలతో పాటు సమీపంలోని పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లో వసతి సౌకర్యం చూసుకుని భద్రాచలం వచ్చి వెళ్తుంటారు. అయితే ఇప్పుడు ఇటు భక్తులకు, అటు పర్యాటకులకు సరి కొత్త అనుభూతి కలిగించేలా తొలిసారిగా గోదావరి తీరంలో క్యాంపింగ్‌ సైట్‌ ఏర్పాటు చేస్తున్నారు.



వెదురు కర్రలతో నిర్మిస్తున్న ఫుడ్‌ స్టాల్‌

కరకట్ట వెంట నిర్మాణం..

భద్రాచలంలో గోదావరి కరకట్ట వెంబడి ఆధునిక సౌకర్యాలతో కూడిన క్యాంప్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఈ క్యాంపుల చుట్టూ స్థానిక సంస్కృతి ఉట్టిపడేలా వెదురు కర్రలతో ఫెన్సింగ్‌ ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళ వెలుగు కోసం సోలార్‌ లైటింగ్‌ సౌకర్యం కల్పిస్తున్నారు. వెదురు పందిరి కింద కామన్‌ కిచెన్‌ ఏర్పాటు చేసి అక్కడ స్థానిక మహిళలతో గిరిజన వంటకాలు తయారు చేయించి భక్తులకు అందుబాటులోకి తెస్తున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ క్యాంప్‌ సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, పర్యాటకులకు ఆధ్యాత్మిక అనుభూతి కలగడంతో పాటు స్థానిక సంస్కృతి, ఆహారపు అలవాట్లను పరిచయం చేసే అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా ఈ క్యాంప్‌సైట్‌కు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. పర్యాటకులు/భక్తుల నుంచి వచ్చే ఆదరణను బట్టి నవమి వరకు వీటిని కొనసాగించాలని నిర్ణయించారు. ఆ తర్వాత శాశ్వత ప్రాతిపదికన మరింత మెరుగైన సౌకర్యాలు, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా ఇక్కడ క్యాంప్‌ సైట్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏర్పాట్లు చివరి దశలో..

భద్రాచలంటౌన్‌: భద్రాద్రిలో రివర్‌ ఫెస్టివల్‌ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు ముగింపు దశకు చేరుకున్నాయని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ తెలిపారు. గోదావరి కరకట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న తాత్కాలిక విడిది గృహాలు, వివిధ గిరిజన వంటకాలు, గిరిజన కళాఖండాల స్టాళ్లు, బోటింగ్‌ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతమంతా విద్యుత్‌ కాంతులు వెదజల్లేలా సోలార్‌ లైట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చుట్టూ ఉన్న గోదావరి అందాలను ఫొటోలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్‌ నిర్మించామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణమంతా వినిపించేలా సౌండ్‌ సిస్టం ఏర్పాటు చేయాలని ఆలయ ఈఈ రవీందర్‌ను ఆదేశించారు. అనంతరం గోదావరిలో బోటులో విహరించి పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న టెంట్లు

వామన రూపుడైన వరాల రామయ్య

- భద్రగిరిలో వైభవోపేతంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు
- నేడు పరశురామావతారంలో దర్శనం

భద్రాచలం: బలి చక్రవర్తి గర్వాన్ని అణిచేందుకు వెలిసి.. మూడడుగుల స్థలాన్ని కోరి రాక్షసరాజుకు గర్వభంగం చేసిన వామనావతారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్యకు భక్తులు జేజేలు పలికారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామిని వామనావతారంలో అలంకరించారు. తొలుత గర్భగుడిలో సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన గావించారు. అర్చక స్వాములు పూజల నడుమ వేద పండితులు రెండు వందల పాశురముల ప్రబంధాలను పఠించారు. వామనావతారంలో అలంకరించిన స్వామివారికి బేడా మండపంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం నుంచి ఊరేగింపుగా మహిళలు కోలాట ప్రదర్శనల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేక వేదికపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు నీరాజనాలు పలికారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామివారికి తిరువీధి సేవ జరిపి.. తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.



వామనావతారంలో దర్శనమిస్తున్న స్వామివారు, పక్కన ఆళ్వార్లు

నేడు పరశురాముడిగా..

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీ మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి పుత్రుడిగా జన్మించి పరశురాముడు(భార్గవరాముడు) అని పిలవబడుతూ దుష్టులైన కార్తవీర్యార్జునుని, దుర్మార్గులైన రాజులను 21సార్లు దండెత్తి సంహరించి ధర్మాన్ని స్థాపించాడు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి.

సీసీ.. పోలీస్‌తో సమానం

- నిఘా నేత్రాల వినియోగం పెంచాలి
- ఎస్పీ రోహిత్‌రాజ్‌

మణుగూరు టౌన్‌: సీసీ కెమెరా ఒక పోలీసు సిబ్బందితో సమానమని ఎస్పీ రోహిత్‌రాజ్‌ అన్నారు. వ్యాపార సముదాయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో, నివాసాల్లో సీసీ కెమెరాల వినియోగం పెంచి నేర నియంత్రణలో ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. మణుగూరు పోలీస్‌స్టేషన్‌తో పాటు పట్టణంలోని పలు ప్రధాన ఏరియాల్లో ఏర్పాటు చేసిన 92 సీసీ కెమెరాలను, రెండు ఆటోమెటిక్‌ నంబర్‌ రికగ్నైజేషన్‌ కెమెరాలను(ఏఎన్‌పీఆర్‌)లను శనివారం ఆయన ప్రారంభించారు. మణుగూరు పట్టణం దినదినాభివృద్ధి చెందుతోందని, సీసీ కెమెరాల వినియోగంతో నేరాలను నియంత్రణతో పాటు తప్పులను గుర్తించే వీలు కలుగుతుందని చెప్పారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వాహనాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఐ సతీష్‌ శనివారం రాత్రి పట్టణంలోని వ్యాపారులతో మాట్లాడి సీసీ కెమెరాల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

పినపాక: వలస గొత్తికోయ గ్రామాల ఆదివాసీలకు పోలీస్‌ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజ్‌ అన్నారు. వలస ఆదివాసీ గ్రామాలైన తెర్లాపురం, మల్లారం, పిట్టతోగు గ్రామస్తులకు శనివారం వైద్య శిబిరం నిర్వహించగా ఎస్పీ ప్రారంభించారు. పిల్లలను బడికి పంపిస్తేనే ఆదివాసీలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. బడీడు పిల్లలను పనులకు పంపితే ప్రభుత్వం నుంచి అందే పథకాలను రద్దు చేస్తామని చెప్పారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ప్రాణిక్‌ హీలింగ్‌ ఫౌండేషన్‌ ఆఫ్‌ సికింద్రాబాద్‌ ఆధ్వర్యంలో దుప్పట్లు, ఎల్‌ఈడీ బల్బులు, పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పినపాక మండలం పెద్దతోగులో ఆదివాసీలకు మందులు పంపిణీ చేస్తున్న ఎస్పీ తదితరులు

గిరిజన సంస్కృతిపై విస్తృత ప్రచారం

కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌

దుమ్ముగూడెం : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను విస్తృతంగా ప్రచారం చేసేలా రివర్‌ ఫెస్టివల్‌ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ తెలిపారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్న బొజ్జిగుప్ప గ్రామాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి భద్రాచలం వచ్చే భక్తులకు గిరిజనుల సంస్కృతి, పాతకాలపు కట్టడాలు, వారి జీవనశైలిని తెలియజేసేలా రివర్‌ ఫెస్టివల్‌ ఏర్పాటు చేశామన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన హైదరాబాద్‌ నుంచి ఒక బృందాన్ని రప్పిస్తున్నామని, భద్రాచలంలో ఏర్పాటు చేసే విడిది కేంద్రంలో బసచేసి, తెల్లవారి బొజ్జిగుప్ప గ్రామాన్ని సందర్శిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

సింగరేణి(కొత్తగూడెం): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించగా, జిల్లా నుంచి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే స్పాట్లను గుర్తించి అవసరమైన చోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రెహమాన్‌, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఇందిర పాల్గొన్నారు.

గృహోపకరణాల పరిశీలన..

భద్రాచలంటౌన్‌: ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో డీఆర్డీఏ, ఎంఎస్‌ఎంఈ, సెల్ఫ్‌హెల్ప్‌ గ్రూప్‌ మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, గృహోపకరణాలను కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముక్కోటికి భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులకు గిరిజన సంస్కృతిని తెలియజేసేలా ప్రత్యేకమైన గిరిజన వంటకాలు తయారు చేయాలని, గృహోపకరణాలను కొనుగోలు చేసేలా ప్రత్యేక డిజైన్‌లతో ప్యాక్‌ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, జేడీఎం హరికృష్ణ, ప్యాకింగ్‌ డిజైనర్స్‌ కీర్తన, కల్పన, అనురాధ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి

కొత్తగూడెంరూరల్‌: సర్వజన ఆస్పత్రిలో డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ పాటిల్‌ ఆర్‌ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఈ పనులతో పాటు డయాలసిస్‌ వార్డును పరిశీలించారు. క్యాజువాలిటిలో డయాలసిస్‌ వార్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌ఎంఓ రమేష్‌ పాల్గొన్నారు.

పోలవరం.. కలవరం..

- ప్రాజెక్ట్‌తో భద్రాచలానికి ముప్పు ?
- నివేదిక రూపొందించాలన్న సీఎం రేవంత్‌ రెడ్డి
- ఐఐటీ, హైదరాబాద్‌కు బాధ్యతలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మరోసారి పోలవరం – భద్రాచలం అంశం తెరపైకి వచ్చింది. పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణ.. ప్రత్యేకించి భద్రాచలంపై పడే ప్రభావాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదిక తయారీ బాధ్యతలను ఐఐటీ, హైదరాబాద్‌కు అప్పగించారు. ఐఐటీ, హైదరాబాద్‌ టీమ్‌తో కో ఆర్డినేట్‌ చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక సమన్వయకర్తను సైతం నియమించాలని ఆదేశించారు. నెల రోజుల్లోగా ఈ నివేదిక రావాలని గడువు విధించారు.

భయపెట్టిన వరదలు..

ప్రతీ ఏడాది వానాకాలంలో గోదావరికి ఉధృతంగా వరదలు వస్తుంటాయి. వందేళ్ల వరద చరిత్రను పరిశీలిస్తే 1986లో అత్యంత భారీ స్థాయిలో గోదావరి పోటెత్తింది. భద్రాచలం దగ్గర వరద నీటి మట్టం 76 అడుగులు నమోదు కాగా 36 లక్షల క్యూసెక్కుల వరద వెళ్లింది. ఈ వరద ధాటికి భద్రాచలం పట్టణంతో పాటు ఏజెన్సీ అంతా అతలాకుతలమైంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ స్వయంగా పర్యటించి సహాయ కార్యక్రమాలు పరిశీలించారు. ఆ తర్వాత 2006లో మరోసారి గోదావరికి తీవ్రస్థాయిలో వరదలు వచ్చాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఏడాది వరదలు వచ్చినప్పటికీ 2022 జూలైలో వచ్చిన వరదలు.. భద్రాచలం మునిగిపోతుందా అనే స్థాయిలో భయపెట్టాయి.

వెనక్కి తగ్గని వరద..

ఎగువ ప్రాంతంలో ఏర్పడిన క్లౌడ్‌బరస్ట్‌ కారణంగా 2022 జూలై 16వ తేదీ రాత్రి అనూహ్యంగా గోదావరికి 27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. భద్రాచలం వద్ద నీటి మట్టం 72 అడుగులకు చేరుకుంది. ఇక్కడ నిర్మించిన కరకట్ట ఎత్తు 80 అడుగులు కాగా దాదాపు అంచుల వరకు అన్నట్టుగా వరద పోటెత్తింది. యటపాక దగ్గరైతే కరకట్ట పైనుంచి నీళ్లు ఊర్లోకి వచ్చాయి. దీంతో ఏ క్షణమైనా కరకట్ట తెగిపోయి భద్రాచలం జలమయం అవుతుందా అనే భయం నెలకొంది. ఆ తర్వాత వరద తగ్గుముఖం పట్టడంతో ప్రమాదం తప్పింది. అయితే నీటి మట్టం 71 అడుగుల నుంచి 51 అడుగులకు తగ్గడానికి చాలా సమయం పట్టడం అనేక సందేహాలకు తావిచ్చింది. గతంలో చాలా వేగంగా గోదావరి వరద వెనక్కు తగ్గేది. కానీ 2022లో రెండు మూడు రోజుల సమయం పట్టింది. దీంతో పోలవరం ప్రాజెక్టు కారణంగానే వరద వెనక్కు తగ్గడంలో ఆలస్యమైందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.



పోలవరం పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్‌)

అప్పట్లోనే హామీ..

గోదావరి వరదలో వచ్చిన అనూహ్య మార్పును అప్పటి సీఎం కేసీఆర్‌ ప్రస్తావిస్తూ పోలవరం కారణంగా గోదావరి వరద ప్రవాహంలో వచ్చిన మార్పులను అంచనా వేసి సరికొత్త కాంటూర్‌ లెవల్స్‌ను నిర్ణయిస్తామని ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఈ దిశగా పెద్దగా అడుగులు పడలేదు. మళ్లీ రెండున్నరేళ్ల తర్వాత ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. పోలవరంతో వచ్చే సమస్యలను అంచనా వేసే పనిని ఐఐటీ, హైదరాబాద్‌కు అప్పగించారు. ఈ నివేదికలో వెలికి వచ్చే అంశాలను గోదావరి రివర్‌ మేనేజ్‌మెంట్‌ బోర్డు, కేంద్ర జలశక్తిల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.


కార్పొరేషన్‌గా ‘గూడెం’

- ఆమోదించిన రాష్ట్ర కేబినెట్‌
- జిల్లా కేంద్రం అభివృద్ధికి కొత్త బాటలు
- ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అనుమానాలను పటాపంచలు చేస్తూ కొత్తగూడెం కార్పొరేషన్‌ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్‌ శనివారం ఆమోదం తెలిపింది. జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న కొత్తగూడెం – పాల్వంచ – సుజాతనగర్‌లను ఒక్కటిగా చేస్తూ కొత్తగూడెం మున్సిపల్‌ కార్పొరేషన్‌గా మార్చాలని కేబినెట్‌ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమాచారాన్ని శనివారం రాత్రి రాష్ట్ర స్థాయి అధికారులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఫోన్‌ ద్వారా తెలిపారు.

గవర్నర్‌ ఆమోదముద్ర వేస్తే..

రాష్ట్రంలో వివిధ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర కేబినెట్‌ శనివారం భేటీ అయింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌లో కొత్తగూడెం అంశాన్ని చేర్చలేదు. అయితే కేబినెట్‌ సమావేశం మొదలైన తర్వాత టేబుల్‌ ఐటమ్‌గా దీన్ని స్వీకరించి చర్చ జరిపారు. ఆ తర్వాత కార్పొరేషన్‌ ఏర్పాటుకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చారు. కొత్తగూడెం, పాల్వంచలను కార్పొరేషన్‌గా మార్చేందుకు చట్టపరమైన చిక్కులు ఉండటంతో ఈ మేరకు త్వరలో ఆర్డినెన్స్‌ రూపొందించనున్నారు. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్‌ ఆమోదముద్ర వేసిన తర్వాత కార్పొరేషన్‌ అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత చట్టసభలో ఇది ఆమోదం పొందాల్సి ఉంటుంది.



కొత్తగూడెం పట్టణ వ్యూ

కూనంనేని కృషి..

మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు అంశం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉంది. అయితే కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రాష్ట్రపతి ఉత్తర్వులు మొదలుకొని ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా, జార్ఖండ్‌ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలను పరిశీలించారు. మరోవైపు మంత్రి తుమ్మల సహకారం తీసుకుంటూ ఈ ఫైలును ముందుకు నడిపించారు. చివరకు చట్టపరమైన చిక్కులను అధిగమిస్తూ రెండు మున్సిపాలిటీలు ఏడు పంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్‌ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించారు. దీంతో దాదాపు పాతికేళ్ల తర్వాత పాల్వంచ పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు దారులు పడినట్టయింది. గతేడాది కొత్తగూడెం అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.


కొత్తగూడెం పేరుతోనే..

కొత్తగూడెం పట్టణంలో 36 వార్డులు, పాల్వంచలో 24 వార్డులు, సుజాతనగర్‌ మండలంలో 7 పంచాయతీలు కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్‌ ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్పొరేషన్‌కు ఏ పేరు పెట్టాలనే అంశంపై తొలుత సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే జిల్లా పేరులో భద్రాచలం, కొత్తగూడెం ఉన్నాయి. మళ్లీ కార్పొరేషన్‌లో కొత్తగూడెం, పాల్వంచను చేర్చడం సబబుగా ఉండదనే అభిప్రాయం ఎక్కువ మంది నుంచి వ్యక్తమైంది. దీంతో చివరకు కొత్తగూడెం పేరుతోనే కార్పొరేషన్‌ ఏర్పాటుకు అధికారులు మొగ్గు చూపారు.

రేవంత్‌, భట్టికి కృతజ్ఞతలు

తన ప్రతిపాదనలను పరిశీలనలోకి తీసుకుని కొత్తగూడెం కార్పొరేషన్‌ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియలో సహకరించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కూడా ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్‌ ఏర్పాటు విషయంలో శ్రమించిన ఐఏఎస్‌ అధికారులు దానకిశోర్‌, శ్రీదేవి, జితేశ్‌ వి పాటిల్‌లకు సైతం కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తగూడెంరూరల్‌ : లక్ష్మీదేవిపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన గంగ్రబంధంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి శనివారం పర్యటించారు. గిరిజనులకు అందుతున్న కనీస వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్‌ శనివారం తనిఖీ చేశారు. ముందుగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా పర్ణశాలలో ఏర్పాటు చేసే ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్లపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో స్టాక్‌ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌ చేస్తుండాలని సూచించారు. ఐఎల్‌ఆర్‌ గదులను పరిశీలించి నిర్దేశిత టెంపరేచర్లలోనే వ్యాక్సిన్లు భద్రపరచాలని అన్నారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ చైతన్య, సీసీ పాయం శ్రీను, వైద్యాధికారులు పుల్లారెడ్డి, రుక్మాకర్‌, రేణుక తదితరులు పాల్గొన్నారు.



పర్ణశాల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్‌

క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు డాక్టరేట్



డాక్టరేట్‌తో పాటు స్వర్ణ పతకం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు డాక్టరేట్‌తో పాటు స్వర పతకం అందుకున్నారు. విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావుకు డాక్టరేట్, పతకం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. అమెరికా ప్రభుత్వం డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ డాక్టర్ ఎమోస్ జేమ్స్, డాక్టర్ కె పాల్ శామ్యూల్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కాగా, తాను రెండోసారి డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 39 అవార్డులు, 36 బంగారు పతకాలు, మహానందులు 6, బుద్ధపూర్ణిమ తదితర అవార్డులు సాధించినట్లు వివరించారు.

గిరిజన సంక్షేమ శాఖ ఈఈగా చంద్రశేఖర్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంలో గిరిజన సంక్షేమ ఈఈగా వై.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని సీఈ కార్యాలయంలో డీఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనను భద్రాచలం ఐటీడీఏకు బదిలీ చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

జూలూరుపాడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జూలూరుపాడులో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన జట్టుకు రూ 20వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతి రూ 10వేలు, నాలుగో బహుమతి రూ 5వేలు అందజేయనున్నట్లు వివరించారు. ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించాలని పేర్కొన్నారు.

బ్రెయిలీ అందరికీ ఆదర్శం

కొత్తగూడెంటౌన్: అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ చేసిన కృషి మరువలేనిదని, దీంతో ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని జిల్లా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా అన్నారు. ఐడీఓసీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ చేసిన సేవలకు గాను బ్రెయిలీ డేగా జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో బ్లైండ్ అసోసియేషన్ సభ్యులు నరేందర్, బాలకృష్ణ, రమణయ్య, కిరణ్, ఉపేందర్, బిందు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం



ప్రశంసా పత్రం అందిస్తున్న డీఈఓ

బూర్గంపాడు: సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కింతాడ వల్లిశ్రీ అలివేణి శనివారం కొత్తగూడెంలో జరిగిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో అన్ని విభాగాల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ టాలెంట్ టెస్ట్‌లో వల్లిశ్రీ అలివేణి 100కు 83మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించింది. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి ఆమెకు ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందించారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: రామవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఐదవ తరగతి ప్రవేశాలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మీ సేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రం, మొబైల్ నంబర్‌తో పాటు రూ.100 పరీక్ష ఫీజుతో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు తుది గడువు ఫిబ్రవరి 1వ తేదీ అని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్ : తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను అందిస్తోందని, ఈనెల 4 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కె. సంజీవరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి గల క్రిస్టియన్, మైనారిటీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా!

- నృత్యాలతో హోరెత్తించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
- యూత్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన కేయూ వీసీ



దోలుతో నృత్యం చేస్తున్న యువతులు



అమ్మవారి వేషధారణలో యువతి నృత్య ప్రదర్శన

ఖమ్మం రాపర్తినగర్: పాశ్చాత్య గేయాలకే కాదు భరతనాట్యం, జానపద పాటలకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేసిన నృత్యాలతో ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(కేఎండీసీ) శనివారం హోరెత్తింది. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్‌ను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చదువుకుంటూ సమాజంపై బాధ్యతగా సాంఘిక దురాచారాల నిర్మూలనకు పాటుపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ రూపాల్లో చేసిన నృత్యాలు అలరించాయి. ఈకార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వై.వెంకయ్య, కేఎండీసీ చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, యూత్ ఫెస్టివల్‌లో విజేతలకు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ బహుమతులు అందజేశారు.



యూత్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి



యువతీయువకుల నృత్యం

బాల శాస్త్రవేత్తకు జాతీయ అవార్డు



విద్యార్థిని అభినందిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్ 10వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థి టి.వరుణ్ కోమల్ జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో అవార్డు కైవసం చేసుకున్నాడు. గత నెల 26 నుంచి 31 వరకు హరియాణాలో జాతీయ స్పోర్ట్స్ యూనివర్సిటీ రాయ్ ఆవరణలో జరిగిన జాతీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. ప్రశంస పత్రం, నూతన బాల శాస్త్రవేత్తగా సైన్స్ ఎగ్జిబిషన్ ట్రోఫీ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందుకున్నాడు. గైడ్ టీచర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో స్మార్ట్ అగ్రికల్చర్ రోబో రూపొందించగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా సింగరేణి జీఎం వి.కృష్ణయ్య వరుణ్‌కోమల్‌ను, స్మార్ట్ అగ్రికల్చర్ రోబో తయారీకి గైడ్‌గా వ్యవహరించిన విష్ణుప్రియను శనివారం అభినందించారు. కార్యక్రమంలో సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ జీవీ మోహన్‌రావు, పాఠశాల హెచ్‌ఎం బి. శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు బొద్దుల శ్రీనివాసరావు, కో గైడ్ టీచర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు రోహిత్‌శర్మ



వంగివరపు రోహిత్‌శర్మ

కామేపల్లి: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన వంగివరపు రోహిత్‌శర్మ నేపాల్‌లో జరగనున్న అంతార్జతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్టులో స్థానం దక్కించుకున్నాడు. టెన్నిస్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మధురలో నిర్వహించిన పోటీల్లో రోహిత్‌శర్మ ప్రతిభ కనబర్చగా జట్టుకు ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రోహిత్‌ను కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌తో పాటు నాయకులు అంబడిపూడి వెంకటేశ్వరరావు, ధనియాకుల మాధవరావు, బానోత్ నరసింహనాయక్, మేకల లక్ష్మీనారాయణ, శీలం పుల్లయ్య, పసుమర్తి సత్యనారయణ, వంగివరపు సీతారామాంజనేయశర్మ తదితరులు అభినందించారు.

సీఆర్టీల సమ్మె విరమణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు శనివారం సమ్మె విరమించారు. ఉమ్మడిజిల్లాలోని మొత్తం 278 మంది 15 రోజులుగా సమ్మె చేస్తుండగా తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సీఆర్టీల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇవ్వడంతో విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ మినహా మిగతా డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన దిలీప్

జూలూరుపాడు: చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో శనివారం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం అనంతారం గ్రామానికి చెందిన దిలీప్, జూలూరుపాడుకు చెందిన నవీన్, మనోజ్ అనే ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్వంచలో పరీక్ష రాసి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కొత్తగూడెం బైపాస్ రోడ్ నుంచి మెయిన్ రోడ్‌పైకి కారు వస్తుండగా జూలూరుపాడు వెళ్లే బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దిలీప్, మనోజ్‌లకు తీవ్ర గాయాలు కాగా, నవీన్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట : మండల పరిధిలోని జలవాగు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని జలవాగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, ఎస్సై సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.7,940 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పునుకులలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ బి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో వెళ్లగా ఎనిమిది మందిలో నలుగురు పారిపోయారు. మిగితా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.9,700తో పాటు రెండు స్కూటీలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి : పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపుదాడులు చేశారు. తిమ్మంపేట, ముత్యాలంపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వేర్వేరుగా ఈ దాడులు నిర్వహించడం గమనార్హం. తిమ్మంపేట శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13 వేలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో..

ముత్యాలంపాడు శివారులో పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ 5,980 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయా ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు కాగా, నిందితుడిగా ఉన్న బాలుడిని శనివారం పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై ఈ నెల 1న, అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడు(17) ఆటోలో గ్రామ శివారులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనపై చిన్నారి తల్లి చేసిన ఫిర్యాదుపై స్థానిక ఎస్సై యయాతి రాజు కేసు నమోదు చేశారు. బాలుడిను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రూ.26లక్షల విలువైన సిగరెట్లు చోరీ



షాపులో పరిశీలిస్తున్న పోలీసులు

పాల్వంచ: పాల్వంచలోని ఓ షాపులో భారీ చోరీ చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాల్వంచలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో ఐటీసీ డీలర్‌గా డీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట పవన్ మణియార్ స్టాక్ పాయింట్ కొనసాగిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్లను తొలగించి 24 కాటన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సుమన్ చేరుకుని క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. కాగా, చోరీ అయిన సిగరెట్ల విలువ రూ.26లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

విద్యార్థి ఆత్మహత్య



శంకుచరణ్ (ఫైల్)

చండ్రుగొండ : మండలంలోని బాల్యాతండా గ్రామానికి చెందిన లావుడియా శంకుచరణ్(17) కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శంకుచరణ్ జూలూరుపాడులోని వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గతనెల 27న ఇంటికి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు జ్యోతి, వీరన్న, తాత చంద్రు మందలించారు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన తిరిగి పాఠశాలకు వెళ్లాడు. అయితే ఇంటివద్దనే కలుపుమందు తాగిన విద్యార్థి పాఠశాల గేటు వద్దకు వెళ్లి కుప్పకూలి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న శంకుచరణ్‌కు స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి, ఆ తర్వాత కొత్తగూడెం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించగా శనివారం తెల్లవారుజామున ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచాడని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పాపయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కేటీపీఎస్ ఉద్యోగి మృతి

పాల్వంచ: రెండు మోటర్‌సైకిళ్లు ఢీకొన్న ఘటనలో కేటీపీఎస్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఒడ్డుగూడేనికి చెందిన కేటీపీఎస్ ఉద్యోగి కనిగిరి ఆంజనేయులు(58) శనివారం ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చాడు. కేఎస్‌పీ రోడ్ నటరాజ్ సెంటర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీ కొట్టింది. దీంతో ఆంజనేయులు తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. పల్సర్ నడుపుతున్న అనిల్, వెనుక ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఈసం శారదను 15 ఏళ్ల క్రితం పాల్వంచకు చెందిన ఈసం నరేష్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక పాప బాబు ఉన్నారు. గత కొంత కాలంగా భర్త నరేష్, అత్త లక్ష్మి, ఆడపడుచు సరిత వేధింపులకు పాల్పడుతుండగా శారద ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ చందర్ కేసు నమోదు చేశారు.

బైక్ అపహరణ..

ఇల్లెందు: ఇల్లెందు మండలం సుభాష్ నగర్‌కు చెందిన ఈసం వెంకట్ నవంబర్ 1న రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశారు. ఉదయం చూడగా బైక్ అపహరణకు గురై ఉంది. పలుచోట్ల ఆరా తీసినా లభించకపోవటంతో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నాగుల్‌మీరా ఖాన్ కేసు నమోదు చేశారు.

మామ హత్య కేసులో కోడలి అరెస్ట్

కారేపల్లి: బయట తిరుగుళ్లు తగ్గించుకోవాలని సూచించిన మామపై వేడి నూనె పోసి ఆయన మరణానికి కారణమైన మహిళను పోలీసుల అరెస్ట్ చేశారు. మండలంలోని పైల్‌తండాకు చెందిన అజ్మీరా బాబు(60) కుమారుడు మృతి చెందగా సురేష్ భార్య ఉమ కుటుంబ సభ్యులతో జీవిస్తుంది. ఆమె తరచుగా బయటకు వెళ్తుండడంతో మందలించిన మామ బాబుపై డిసెంబర్ 28న వేడి నూనె పోసింది. ఆయన చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందగా కారేపల్లి పోలీసులు ఉమను శనివారం అరెస్ట్ చేసి ఖమ్మం కోర్టులో హాజరుపరిచారు.

మద్యం మత్తులో ఉపాధ్యాయుడు.. ఎమ్మెల్యే ఆగ్రహం



ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట : మద్యం మత్తులోనే పాఠశాలకు వచ్చిన ఓ ఉపాధ్యాయుడిపై అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పూసుకుంట, కటుకూరు గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కటుకూరులో ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు కనీసం ఊరు పేరు కూడా రాయలేని పరిస్థితిలో ఉండగా ఏం చదువు చెబుతున్నారని ఉపాధ్యాయుడిని మందలించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు దగ్గరికి రాగా, మద్యం వాసన రావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు పూసుకుంటలో కొండరెడ్లకు ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకం ద్వారా 12 ఉచిత వ్యవసాయ బోర్లు మంజూరు కాగా.. ఎమ్మెల్యే ఆ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొండరెడ్ల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా, వారికి పలు ఉచిత పథకాలను అందజేయనున్నామని వెల్లడించారు. త్వరలోనే వ్యవసాయ క్షేత్రాల్లో పామాయిల్ మొక్కలు కూడా నాటిస్తామని హామీ ఇచ్చారు. కొండరెడ్లను వ్యవసాయ రంగంలో ముందుకు నడిపించే దిశగా అనేక రాయితీలు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజు, ఉద్యాన శాఖ అధికారి కిషోర్, ట్రాన్స్‌కో డీఈ నందయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కథా కవితా కార్యశాల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంటౌన్: బాలోత్సవ్ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్న కథా, కవితా కార్యశాల పోటీలు శనివారం ముగిశాయి. రెండో రోజు కథలు, కవితలు రాయడంపై పోటీలు నిర్వహించారు. కథారచయితలు శిరంశెట్టి కాంతారావు, మండవ సుబ్బారావు తదితరులు కథలు రాయడం కథా నిర్మాణం వంటి అంశాలపై వివరించారు. అనంతరం పలు అంశాల్లో పోటీలు నిర్వహించగా పలువురు చిన్నారులు రచనల్లో ప్రతిభ చాటి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 300 మందికి పైగా బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు డీఈఓ వెంకటేశ్వరాచారి, బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ వాసిరెడ్డి రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. కవితలో సెల్ భూతం పై ప్రథమ బహుమతిని చుంచుపల్లికి చెందిన పి.సాయిసింధు, ద్వితీయ బహుమతి ఎస్.అవినాష్ (తల్లాడ), తృతీయ జి.లక్ష్మీ శరణ్య (పాల్వంచ),ఏ.వినయ్‌కుమార్ (మేదరబస్తీ), కథల విభాగంలో బి.విరాట్‌తేజ్, డి. మనోసమాన్విత, బి. విశిష్ట, ప్రత్యేక బహుమతి ఎస్.శృతికీర్తన, జి. జాహ్నవి అందుకున్నారు. కార్యక్రమంలో పలివెల సాంబశివరావు, ఆశోక్‌రాతి, లక్కినేని సత్యనారాయణ, వై వి రామారావు, మొరిశెట్టి భవానీప్రసాద్, తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు కరుణ తాయారమ్మ, పుప్పాల కృష్ణమూర్తి, తోట సుభాషిణి, దేశరాజు, శ్రీనివాస్‌గౌడ్, వరదయ్య, భగవంతం,చిట్టి మధుసూదన్‌రావు, మండవ సుబ్బారావు, శీరంశెట్టి కాంతారావు హాజరయ్యారు.

పలువురు వ్యాపారులకు నోటీసులు



రొంపేడులో దుకాణం సీజ్ చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: మూడు నెలలుగా అనుమతి లేని వ్యాపారులు క్రయ విక్రయాలు రద్దు చేసుకోవాలని మార్కెట్ అధికారులు నోటీసులు అందజేస్తున్నా కొంతమంది వ్యాపారులు భేఖాతర్ చేస్తున్నారు. దీంతో శనివారం ఇల్లెందు మార్కెట్ సెక్రటరీ నరేష్ ఆధ్వర్యంలో మార్కెట్ సిబ్బంది రొంపేడు, కొమరారం, పోలారం, బొంబాయితండా, చెట్టుపల్లి, శంభునిగూడెం, వెన్నెలబైలు, గుండాలలో సోదాలు నిర్వహించారు. మార్కెట్ అధికారుల రాకను గమనించిన పలువురు అధికారులు తలుపులు, షెట్టర్లు బిగించి అదృశ్యం అయ్యారు. ఇక మరి కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా కొనుగోళ్లు చేస్తుండగా వారి నుంచి ఫీజు వసూలు చేశారు. కొందరి కాంటాలు సీజ్ చేశారు. మరి కొందరికి నోటీస్‌లు జారీ చేసినట్లు మార్కెట్ సెక్రెటరీ నరేష్ వెల్లడించారు.

బాబే సుప్రీం.. రెడ్‌బుక్కే రాజ్యాంగం!

ఏపీలో బరితెగించి వ్యవహరిస్తున్న సీఐడీ

న్యాయస్థానమంటే ఖాతరు లేదు.. సీఆర్‌పీసీ 164 అంటే లెక్కే లేదు

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కుతంత్రం

ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం

మొదటి వాంగ్మూలానికి విరుద్ధంగా ఉండకూడదు

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి న్యాయస్థానంలో నమోదు చేసిన వాంగ్మూలం అత్యంత విశ్వసనీయమైనదిగా పరిగణిస్తాం. ఎందుకంటే న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా నమోదు చేసిన వాంగ్మూలమది. ఆ వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదు. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు ప్రయత్నిస్తే వారిని సంబంధిత న్యాయస్థానం ప్రశ్నించాలి. మొదట ఇచ్చిన వాంగ్మూలాన్నే సాక్ష్యంగా పరిగణలోకి తీసుకోవాలి.

– 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు. ఈ మేరకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ కేసులో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విస్పష్టమైన తీర్పునిచ్చింది.

విరుద్ధంగా ఇస్తే కఠిన చర్యలు

ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరోసారి వాంగ్మూలం ఇస్తే అది నేరంగా పరిగణిస్తాం. ఎందుకంటే ప్రమాణ పూర్వకంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయమూర్తి చదవి వినిపించిన తర్వాత సమ్మతించి, మరీ సంతకం చేసి ఇచ్చిన వాంగ్మూలమది. మొదటిసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇవ్వడమంటే.. మొదట ఇచ్చింది తప్పుడు వాంగ్మూలమని అంగీకరించినట్టే. అత్యంత విశ్వసనీయమైన న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ప్రమాణం చేసి మరీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చినట్టు అవుతుంది. అంటే అబద్ధపు వాంగ్మూలం ఇచ్చినందుకు నేరంగా పరిగణిస్తాం. ఆ విధంగా అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వారిపై ఐపీసీ 193, సీఆర్‌పీసీ 340 కింద కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద కుమారి వర్సస్ మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

ఎదుర్కోవాల్సిన పరిణామాలను న్యాయమూర్తి వివరించాలి

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షి ప్రయత్నిస్తే.. దాని వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, ఎదుర్కోవాల్సి వచ్చే పరిణామాల గురించి న్యాయమూర్తి ఆ సాక్షికి వివరించాలి.

– అలహాబాద్ హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగమే ప్రామాణికం.. సుప్రీంకోర్టు తీర్పులే మార్గ నిర్దేశం.. అన్నది దేశంలో పరిపాలన వ్యవస్థకు దిక్సూచి. పాలకులు, అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు అందరూ పాటించాల్సిన విధివిధానాలవి. కానీ రాష్ట్ర సీఐడీ విభాగం అందుకు పూర్తి విరుద్ధంగా బరితెగిస్తోంది. 'చంద్రబాబే మాకు సుప్రీం.. టీడీపీ రెడ్‌బుక్కే మాకు రాజ్యాంగం.. చంద్రబాబు అవినీతి కేసులు నీరుగార్చడమే ఏకైక లక్ష్యం' అని చెలరేగిపోతోంది. అందుకోసం ఏకంగా న్యాయస్థానాల్లో సీఆర్‌పీసీ 164 కింద నమోదు చేసిన వాంగ్మూలం పవిత్రత, ప్రమాణికతనే దెబ్బ తీసేలా కుట్రలకు పదును పెడుతోంది. ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను బరితెగించి మరీ ఉల్లంఘిస్తోంది. చంద్రబాబు సూత్రధారి, పాత్రధారిగా సాగిన కుంభకోణాల గురించి గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలాలకు భిన్నంగా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయించేందుకు సీఐడీ సన్నాహాలు వేగవంతం చేస్తోంది. డీజీపీ పోస్టు ఇస్తానని ముఖ్య నేత ఎర వేయగానే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా తోసిరాజంటూ సీఐడీ ఉన్నతాధికారి చెలరేగిపోతుండటం విస్మయ పరుస్తోంది. ఈ వ్యవహారం యావత్ దేశాన్ని విస్మయానికి గురి చేస్తోంది.

కుంభకోణాల కుట్రదారు చంద్రబాబే

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాల కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఇసుక కుంభకోణం.. ఇలా వివిధ కుంభకోణాలతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వాటిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతోసహా ఆ భారీ దోపిడీని బట్టబయలు చేసింది. ఆ వ్యవహారాల్లో కీలక పాత్రధారులుగా ఉన్న ఐఏఎస్ అధికారులను విచారించింది. నిబంధనలకు విరుద్ధమని తాము అభ్యంతరం



తెలిపినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదని వారు చెప్పారు. చంద్రబాబు ఒత్తిడితోనే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల బదలాయింపు, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు, కాంట్రాక్టుల కేటాయింపు, నిధుల విడుదల.. ఇలా అన్ని వ్యవహారాలు సాగాయని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ కమిషనర్‌గా వ్యవహరించిన చెరుకూరి శ్రీధర్, ఫైబర్‌నెట్ ఎండీగా వ్యవహరించిన అజయ్ జైన్, గుంటూరు కలెక్టర్‌గా చేసిన కాంతిలాల్ దండే తదితరులు ఆ వాస్తవాలను 'సిట్'కు తెలిపారు. అంతే కాకుండా ఆ విషయాలను న్యాయస్థానంలోనూ వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఆర్‌పీసీ 164 కింద వారు ఇచ్చిన వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేసింది. అందుకే ఆ కేసుల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడు(ఏ1)గా పేర్కొంటూ సిట్ కేసులు నమోదు చేసింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయగా, ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

తప్పుడు వాంగ్మూలాల నమోదుకు ప్రభుత్వ కుట్ర

గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చేందుకు కుట్రకు తెరతీసింది. అందుకోసం డీజీపీ, సీఐడీ అధికారులు ఆ కేసుల దర్యాప్తు వివరాలను చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంటే ప్రధాన నిందితుడే ఆ కేసులను సమీక్షించారు. ఆ కేసులను ఎలా నీరుగార్చాలనే కుట్రకు అప్పుడే బీజం పడింది. అనంతరం చంద్రబాబు తరఫున గతంలో వాదించిన ఢిల్లీ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా రంగ ప్రవేశం చేశారు. డీజీపీ, సీఐడీ అధికారులతో సమావేశమై చంద్రబాబుపై కేసులను నీరుగార్చే కుట్రకు కార్యాచరణ రూపొందించారు. గతంలో చంద్రబాబే కుట్రదారు.. కుంభకోణాలకు ఆయనే సూత్రధారి.. అని న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన వారితో తాజాగా తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలని పన్నాగం పన్నారు. ఆ బాధ్యతను సీఐడీకి అప్పగించారు. గతంలో సిట్‌లో సభ్యులుగా ఉన్న కింది స్థాయి అధికారులను డీజీపీ, సీఐడీ చీఫ్ పిలిపించుకుని మరీ తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేసే ప్రక్రియను వివరించారు. బాధిత రైతులు, సాధారణ సాక్షులను కింది స్థాయి అధికారులు బెదిరిస్తుండగా, ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే బాధ్యతను సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ భుజానికెత్తుకున్నారు.

బెదిరించి.. భయపెట్టి..

కుట్రలో భాగంగా ఐఏఎస్ అధికారులు చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించేందుకు సీఐడీ బరితెగించింది. గతంలో న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరద్దుంగా వాంగ్మూలం ఇవ్వాలని వారిపై సీఐడి తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చింది. బెదిరింపులకు పాల్పడింది. తప్పుడు వాంగ్మూలం ఇవ్వకపోతే సంగతి తేలుస్తామని హెచ్చరించింది. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సాధ్యం కాదని, అది నేరమని కూడా ఆ అధికారులు, న్యాయ నిపుణులు చెప్పినా సరే సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ ఏమాత్రం వినిపించుకోలేదని సమాచారం. ఇలా సీఐడీ సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లను బెంబేలెత్తించారు. దాంతో వారు తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చేందుకు సమ్మతించినట్టుగా సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. వారిద్దరితో గుంటూరులోని న్యాయస్థానంలో శుక్రవారం తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించేందుకు సీఐడీ అధికారులు తీసుకువచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే న్యాయాధికారి సెలవులో ఉండటంతో ఆ ప్రయత్నాన్ని శనివారానికి వాయిదా వేశారు. తీరా శనివారం చెరుకూరి శ్రీధర్ ఒక్కరినే తీసుకెళ్లారు. కోర్టు బయట కొద్ది సేపు హైడ్రామా నడిచింది. ఆ తర్వాత కోర్టు హాలు లోపలికి వెళ్లకుండానే శ్రీధర్ వెనుదిరిగారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన ఆయన్ను న్యాయస్థానానికి తీసుకొచ్చి వాంగ్మూలం నమోదు చేయించాలని సీఐడీ నిర్ణయించినట్లు తెలిసింది.

ఏడేళ్ల వరకూ జైలు శిక్ష

న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రక్రియలో ఏ సందర్భంలో అయినా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం తీవ్రమైన నేరం అని సెక్షన్ 229 (1) స్పష్టం చేస్తోంది. అటువంటి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పిస్తోంది. అంటే సీఆర్‌పీసీ 164 కింద న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా రెండు విరుద్ధ వాంగ్మూలాలు ఇస్తే అందులో ఒకటి అబద్ధపు వాంగ్మూలమే అవుతుంది. మొదటి వాంగ్మూలం గానీ రెండో వాంగ్మూలం గానీ ఏది అబద్ధపు వాంగ్మూలం అయినా శిక్షార్హమే. దాన్ని నేరంగా పరిగణించి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

మరీ ఇంత ద్రోహమా? ఇంత బరితెగింపా?

- కూటమి సర్కార్ తీరుపై వైఎస్ జగన్ మండిపాటు
- తల్లికి వందనం, రైతు భరోసా ఎక్కడ చంద్రబాబూ?
- ప్రజలను నమ్మించి.. అధికారంలోకి వచ్చాక వంచనా?
- పిల్లలు, తల్లులు, రైతులు, యువత, వలంటీర్లు.. అందరినీ మోసం చేశారు



సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో అలసత్వం, నిర్లక్ష్యం, ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా తల్లికి వందనం ఎగవేతపై కూటమి సర్కార్‌ను నిలదీశారు. లక్షలాది మంది తల్లులు, పిల్లలు.. అన్నదాతలంటే మీకు అలుసా.. అని ప్రశ్నించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయిందని నిప్పులు చెరిగారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షల మంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా?
- అధికారంలోకి వస్తే తల్లికి వందనం అని, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే అంతకు ముందు మేం ఇస్తున్న అమ్మ ఒడి పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కానీ, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వం అని కేబినెట్లో తేల్చి చెప్పేశారు. ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా?
- ఇక రైతు భరోసా తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే.. అంటే 2019 అక్టోబర్‌లో ప్రారంభించి నప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల మంది రైతుల చేతిలో, రూ.34,378 కోట్లు పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీ కూడా అయిపోయింది. ఒక్క పైసా ఇవ్వలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18 వేలు ఇస్తామన్నదీ మోసమే. నిరుద్యోగ భృతి కింద యువతీ యువకులకు రూ.36 వేలు చొప్పున ఇస్తామన్నది కూడా మోసమే. 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48 వేలు అయినా మోసమే. ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వలంటీర్లకూ మీరు చేసింది మోసమే. ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కామ్‌లే. ఇసుకను వదలడం లేదు, మద్యాన్నీ వదలడం లేదు.
- చంద్రబాబూ గారూ.. రోజులు గడుస్తున్న కొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తోంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం వారి తరఫున నిలబడుతుంది.

శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ సినీ తార జాన్వీకపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె శుక్రవారం రాత్రి కాలినకడన తిరుమల చేరుకుని శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. సినీ డైరెక్టర్ వీఎస్ ఆదిత్య కూడా తిరుమలేశుడిని దర్శించుకున్నారు.

– తిరుమల



జిల్లా వార్తలు

నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



భట్టు అరుణ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంకు చెందిన భట్టు అరుణ్‌కుమార్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ పి.జాన్సన్, డాక్టర్ జీ.పీ.రాజు, పి.సుధాకర్ నేతృత్వాన ఆయన ఫుట్‌బాల్ క్రీడాకారుల శిక్షణపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంధానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా అరుణ్, ఆయన తల్లిదండ్రులు వీరభద్రం, శాంతిని పలువురు అభినందించారు.


లాల్‌సింగ్ తండా వాసికి..



జాన్‌వెస్లీ

కూసుమంచి: కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన భూక్యా జాన్ వెస్లీకి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రకటించారు. ప్రొఫెసర్లు సురేష్‌బాబు, సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించిన ఆయన డాక్టరేట్ అందుకున్నారు. మారుమూల తండాకు చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన జాన్‌వెస్లీ పట్టుదలతో చదివి డాక్టరేట్ సాధించడంతో పలువురు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు అందచేస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్న దానానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు శనివారం విరాళం అందచేశారు. అనంతపురం జిల్లా గుత్తి గ్రామానికి చెందిన గొర్ల రమేష్ – మహేశ్వరి దంపతులు రూ.లక్ష చెక్కును అధికారులు అందచేశాక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు!

- దొడ్డిదారిన హక్కుల బదలాయింపు
- పీఓటీ చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరుల పాగా
- స్థానిక గిరిజనులకు మాత్రం శూన్యహస్తం



దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో పీఓటీ చట్టం, నిబంధనలు ఉల్లంఘించి అసైన్డ్ భూములను గిరిజనేతరులు పట్టాలు చేయించుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు అందజేసిన వ్యవసాయ భూములు అన్యాక్రాంతం కావొద్దనే భావనతో అసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం(పీఓటీ)ను 1977లో తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి ఉచితంగా భూములు పొందిన వారు సాగు చేసుకోవాలే తప్ప కౌలుకు ఇవ్వడం, అమ్మడం, దానం చేయడంపై నిషేధముంటుంది. అయితే, స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితులు అత్యవసర పరిస్థితుల్లో భూములను అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ 1045ను 2004 డిసెంబర్‌లో తీసుకొచ్చింది. ఈ జీఓ ప్రకారం భూములు పొందిన పదేళ్ల అనంతరం కలెక్టర్ల ద్వారా ఎన్ఓసీ పొందితే అమ్ముకునే అవకాశం లభిస్తుంది. ఈ జీఓను సాకుగా చేసుకుని పలువురు అక్రమమార్గాల్లో పట్టాలు చేయించుకున్నారని తెలుస్తోంది.

300 ఎకరాలకు పైగా భూములు

దమ్మపేట మండలంలోని నల్లకుంట, జమేదారు బంజర, గుర్వాయిగూడెం, కొమ్ముగూడెం లింగాలపల్లి గ్రామాల్లో స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితులకు 1970, 80 దశకాల్లో 273, 884, 1458 సర్వే నంబర్లలోని దాదాపు 300 ఎకరాల అసైన్డ్ భూమిని పంపిణీ చేశారు. ఆ సమయాన భూములు అడవుల మాదిరిగా ఉండడంతో వారెవరూ సాగు చేసిన దాఖలాలు లేవు. దీంతో స్థానిక గిరిజనులే సాగు చేస్తుండగా ఇప్పుడు భూములు పొందిన వారికి అమ్ముకునే హక్కు కూడా లేదని స్థానికులు చెబుతున్నారు.

కొనుగోళ్లు, పట్టాలు

మండలంలోని పలు గ్రామాల్లో దాదాపుగా గిరిజనులే తరతరాలుగా జీవిస్తున్నారు. కానీ ఈ గ్రామాలు ఏజెన్సీ పరిధిలో లేకున్నా అధిక శాతం గిరిజనులు ఉన్నప్పటికీ ఇక్కడి అసైన్డ్ భూముల నుంచి కారుచౌకగా కొనుగోలు చేసిన గిరిజనేతరులు దొడ్డిదారిన పట్టాలు చేయించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 1045 జీఓ ఆధారంగా యాజమాన్య హక్కు పత్రాలు పొందారని సమాచారం. కానీ భూములు పొందిన వారికి అమ్ముకునే హక్కు లేకున్నా జీఓ 1045 ఆధారంగా 1990 నుంచి 2020(ధరణి సైట్ ప్రారంభం) వరకు పలువురు గిరిజనేతరులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టాలు చేయించుకున్నారని సమాచారం. కాగా, ఆ భూములు స్వాతంత్ర సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితుల స్వాధీనంలో లేకున్నా కొనుగోలు చేసి పట్టాలు తెచ్చుకోవడం గమనార్హం. అయితే, కొందరు ధరణి సైట్ అందుబాటులోకి వచ్చాక జీఓ 1045 ఆధారంగా అసైన్డ్ భూములను అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకోగా, మరికొందరు రెవెన్యూ ఉద్యోగుల ద్వారా పట్టాలు పొందినట్లు సమాచారం.

గిరిజనులకు అందని పట్టా పుస్తకాలు

గిరిజన ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసిన గిరిజనేతరులు దొడ్డిదారిన యాజమాన్య హక్కులను పొంది ప్రభుత్వం ద్వారా రైతుబంధు సాయం అందుకుంటున్నారు. ఇదే సమయంలో అసలైన గిరిజన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేక ఏ సాయమూ అందడం లేదు. పలు సర్వే నంబర్లలో 2020వ సంవత్సరంలో చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా వివరాలను రికార్డుల్లో పొందుపరిచినా సాగులో ఉన్న గిరిజన రైతులు చాలా మందికి పట్టాదారు పుస్తకాలు అందలేదు. ఇదేంటని ఆరాతీస్తే నిర్దేశిత సర్వే నంబర్లు, వాటి విస్తీర్ణానికి మించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని తెలుస్తోంది. కాగా, దమ్మపేట తహసీల్‌లో పనిచేస్తున్న ఓ అధికారి వ్యవసాయ బోరు వేయించుకునేందుకు అనుమతి కోరిన రైతు నుంచి డబ్బు డిమాండ్ చేసినట్లు ప్రచారం జరిగినా విచారణ చేపట్టలేదు. ఇటీవల రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్‌కు సైతం సదరు అధికారి అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అధికారుల సహకారంతో గిరిజనేతరులు పట్టాలు చేయించుకున్నట్లు సమాచారం.

విచారణ జరిపిస్తేనే ఫలితం



అసైన్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేసి పట్టాలు పొందిన గిరిజనేతరుల వ్యవహారంపై విచారణ జరిపించాలి. తద్వారా గిరిజన కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అలాగే, గతంలో చేసిన సర్వే ఆధారంగా గిరిజనులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి.

– చాపా చలమరావు, లింగాలపల్లి

మా హయాంలో జరగలేదు



ఈ ప్రాంతంలో అసైన్డ్ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఎవరికీ మా హయాంలో కేటాయించలేదు. ఈ అంశంపై మాకు ఫిర్యాదులు కూడా రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సమగ్రంగా విచారణ జరిపించి చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదు.

– వాణి, డిప్యూటీ తహసీల్దార్

మోడీ చేసే మోసాలకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కే.ఏ.పాల్



సమావేశంలో మాట్లాడుతున్న పాల్

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో నిరుద్యోగ సమస్య లేకుండా ఏటా కోటి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిపై ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి భారతరత్న అవార్డు ఇవ్వాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కే.ఏ.పాల్ వ్యాఖ్యానించారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కేంద్ర మంత్రులు వ్యవహరిస్తుండడం మంచి పద్ధతి కాదన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విషయమై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏటా రూ. లక్షన్నర కోట్ల అప్పు చేస్తూ ప్రజలపై భారం మోపుతోందని ఆయన ఆరోపించారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ముగ్గురు మంత్రులు చొరవ చూపాలని కోరారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ గెలుపొందిన చోట్ల వంద రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని పాల్ ప్రకటించారు.

● **ఖమ్మం సహకారనగర్:** సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో 20వేల మంది ఉద్యోగులతో మహాధర్నా నిర్వహిస్తామని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కే.ఏ.పాల్ తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు.

హక్కులు, బాధ్యతలు రెండు కళ్లు



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు

ఖమ్మంసహకారనగర్: అధ్యయనం, అభ్యాసనం, సామాజిక స్ఫృహ లక్ష్యాలుగా.. హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా యూటీఎఫ్ ప్రయాణం కొనసాగుతోందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఏ.వెంకట్ తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు ఈనెల 5నుండి 8వ తేదీ వరకు కాకినాడలో జరగనున్నాయని వెల్లడించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం యూటీఎఫ్ ఆది నుంచి కృషి చేస్తోందని తెలిపారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరొకసారి గెలిపించాలని వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కాగా, హైదరాబాద్, నల్లగొండ నుంచి వస్తున్న జాతాలు వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించగా యూటీఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఖమ్మం జిల్లా జాతాతో కలిసి ముందుకు బయలుదేరగా సీనియర్ నాయకుడు జియావుద్దీన్ ప్రారంభించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, బి.వెంకన్న, షమీ, రాంబాబు, రాందాస్, ఉద్దండు, సురేష్, నాగేశ్వరరావు, సుధాకర్, నవీన్ కుమార్, అరవింద్, శ్రీనివాసరావు, గురవయ్య, శచేంద్రబాబు బి.నర్సింహారావు, రాజశేఖర్, వీరబాబు, కల్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పురుషుల జట్టుతో అసోసియేషన్ బాధ్యులు



సీనియర్ ఖో–ఖో జిల్లా జట్ల ఎంపిక

కల్లూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఖో–ఖో పురుషులు, మహిళల జట్లను శనివారం ఎంపిక చేశారు. కల్లూరు మినీ స్టేడియంలో ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యాన ఎంపిక పోటీలు నిర్వహించగా 50 మంది చొప్పున పురుషులు, మహిళలు హాజరయ్యారు. వీరిలో నుంచి 18మంది చొప్పున క్రీడాకారులతో జట్లను ప్రకటించారు. ఆయా జట్లు ఈనెల 8నుంచి వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఖో–ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత, పీడీలు, అసోసియేషన్ బాధ్యులు వరకా రామారావు, భీమా, ఎస్.ప్రసాద్, సమ్మయ్య, సాంబశివారెడ్డి, పాపారావు, రమేష్, గుంటుపల్లి రమాదేవి, శ్వేత, పద్మ, త్రివేణి, విజయ, సునీత పాల్గొన్నారు. కాగా, క్రీడాకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ తరఫున వుయ్యూరి శ్రీవ్యాల్ క్రీడాదుస్తులు అందజేశారు.



ఉమ్మడి జిల్లా ఖో-ఖో మహిళల జట్టు